క్లుప్తంగా

అక్రమ కట్టడాలు కూల్చివేత



కూల్చివేస్తున్న అధికారులు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ భూమి 375సర్వే నంబర్‌లో నిర్మించిన అక్రమ కట్టడాలను రెవెన్యూ అధికారులు గురువారం కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. కొంతమంది వ్యక్తులు అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని, అందుకే కూల్చివేస్తున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'ఓటుతో ఓడించాలి'

మంచిర్యాలఅర్బన్: రానున్న ఎన్నికల్లో నిరుద్యోగులను మోసం చేసిన పార్టీలను ఓడించాలని టీవీయూవీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎన్నికల్లో నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగభృతి చెల్లిస్తామని హామీ ఇచ్చి విస్మరించటాన్ని తప్పుబట్టారు. రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా ఓడించి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

గుడిపేట చెక్‌పోస్ట్ వద్ద తనిఖీ



సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): శాసనసభ ఎన్నికల నేపథ్యంలో హాజీపూర్ మండలం గుడిపేటలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద గురువారం వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. గుడిపేట చెక్‌పోస్ట్ ప్రత్యేక అధికారి సహజ, ఏఎస్సై రమేశ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు వాహన తనిఖీలు నిర్వహించారు.

నందులపల్లి యువకుడికి గౌరవ డాక్టరేట్

నెన్నెల: మండలంలోని నందులపల్లి యువకుడు దుర్గం శివకు ఉస్మానియా యూనివర్సిటీ అర్థశాస్త్రంలో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 83వ స్నాతకోత్సవంలో భాగంగా గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ చేతుల మీదుగా శివ డాక్టరేట్ స్వీకరించారు. 'ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, గిరిజనుల అభివృద్ధిపై వాటి ప్రభావం' అనే అంశంపై ఆయన చేసిన సమగ్ర పరిశోధాత్మక అధ్యాయానికి ఈ గౌరవం దక్కింది. అధ్యానంలో భాగంగా మ్యాపింగ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, ఎస్ ఓవర్ వ్యూ అనే పుస్తకం రచించారు. 10కిపైగా పరిశోధాత్మక పత్రాలను వివిధ అంతర్జాతీయ సదస్సుల్లో సమర్పించారు.

'పథకాల అమలుకు బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి'



హాజీపూర్‌లో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

నస్పూర్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్, పడ్తనపల్లి, రాపల్లి, కర్ణమామిడి గ్రామాల్లో, నస్పూర్ షిర్కేకాలనీలో గురువారం బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావును మరోసారి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలోని పేదల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో సర్పంచులు, ఎంపీటీసీలు, మండల, గ్రామ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమావేశం వాయిదా

కాసిపేట: ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరు కావడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ఎంఏ అలీం ప్రకటించారు. 11గంటలకు నిర్వహించాల్సిన సమావేశానికి కోనూరు సర్పంచ్ స్వరూప ఒక్కరే హాజరు కాగా కొన్ని శాఖల అధికారులు వచ్చారు. దీంతో 12గంటల వరకు వేచి చూసినా, సభ్యులు రాకపోవడంతో ఎంపీడీవో అధికారులకు ఎన్నికల నిర్వహణపై కొన్ని సూచనలు చేసి సమావేశాన్ని వాయిదా వేశారు.

హాజీపూర్‌లో కవాతు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల, హాజీపూర్, పడ్తనపల్లి, కర్ణమామిడి గ్రామాల్లో హాజీపూర్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. మంచిర్యాలరూరల్ సీఐ తోట సంజీవ్, హాజీపూర్ ఎస్సై నరేశ్‌కుమార్‌తో పాటు సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ మనుల, సీఆర్‌పీఎఫ్ దళం, హాజీపూర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్‌కు అవస్థలు..!

- పలు కేంద్రాల్లో అందని సేవలు
- ఇబ్బందుల్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



గ్రామీణ బ్యాంకులో పని చేయని ఆధార్ కేంద్రం



స్టేట్ బ్యాంకులో కొనసాగుతున్న ఆధార్ కేంద్రం



ఎంపీడీవో కార్యాలయం ఎదుట మూసివేసి...

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని పలు ప్రదేశాల్లో ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలు పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆధార్ ప్రింట్, బయోమెట్రిక్, పేరు మార్పు, పుట్టిన తేదీ పలు సేవల కోసం ఆధార్ కేంద్రాలను జిల్లాలో మండలానికి ఒక్కటి చొప్పున ఏర్పాటు చేయగా, ప్రస్తుతం మూడు మండలాల్లో జన్నారం, మంచిర్యాల, కాసిపేటలో మాత్రమే కొనసాగుతున్నాయి. మిగిత మండలాల్లో ఆధార్ కేంద్రాలను మూసివేశారు. ప్రతీ వ్యక్తికి పుట్టిన శిశువు నుంచి ఆధార్ తప్పనిసరి కావడం, పలు కేంద్రాలు మూసివేయడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం మూసివేయగా, నూతనంగా యూఐడీఏఐ సంస్థ వారు బ్యాంకులు, పోస్టాఫీసు, ఇతర కేంద్రాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, గ్రామీణ బ్యాంకు, పోస్టాఫీసులలో మొత్తం మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల నుంచి గ్రామీణ బ్యాంకులో కేంద్రం పనిచేయకపోవడం, పోస్టాఫీసులో కంప్యూటర్ చెడిపోవడంతో రెండు ఆధార్ కేంద్రాలు పనిచేయడం లేదు. ఒక్క స్టేట్ బ్యాంకులో మాత్రమే కొనసాగడంతో టోకెన్‌లు దొరకక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం రోజుకు యాభై టోకెన్‌లను మాత్రమే ఇస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి తిరిగి వెళ్లిపోతున్నారు. చిన్న చిన్న మార్పుల కోసం ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతూ అవస్థలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని ఆధార్ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది అవుతోంది..



ఆధార్ కార్డులో మార్పు కోసం బ్యాంకుకు వచ్చినా పనిచేయడం లేదు అంటున్నారు. మళ్లీ రావాలంటే ఇబ్బంది అవుతోంది. ప్రజలకు సౌకర్యంగా ఉంచేలా అధికారులు మరిన్ని ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

– సాగర్, వెంకట్రావుపేట

చాలా రోజుల నుంచి మూసి వేశారు



ప్రభుత్వం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం సంవత్సరం నుంచి మూసివేశారు. జీవనోపాధిగా ఉంటుందని అనుకుంటే నష్టపోయాను. ఎన్నిసార్లు చెప్పినా యాక్టివేట్ చేయడం లేదు. కేంద్రాన్ని మూసివేశారు.

– వెంకటేష్, ఆధార్ కేంద్రం నిర్వాహకులు, లక్సెట్టిపేట

ప్రభుత్వం మూసివేసింది..

ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం జిల్లాలో కొన్ని కారణాల వల్ల మూసివేశారు. ప్రస్తుతం జిల్లా మొత్తంగా మూడు కేంద్రాలు మాత్రమే నడుస్తున్నవి. బ్యాంకుల్లో ఇతర కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వాటి ద్వారా ప్రజలకు సేవలను అందిస్తున్నారు.

– సునీల్, ఈడీఎం అధికారి, మంచిర్యాల

గెలిస్తే కొత్త క్వార్టర్స్ కట్టిస్తాం

- వెరబెల్లి రఘునాథ్‌రావు



కృష్ణా కాలనీలో ప్రచారంలో రఘునాథ్‌రావు

శ్రీరాంపూర్: వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే సింగరేణి కార్మికులకు కొత్తగా క్వార్టర్లను కట్టిస్తామని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు తెలిపారు. శ్రీరాంపూర్‌లోని కృష్ణా కాలనీలో గురువారం ఆయన గడపగడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ శక్తి కేంద్ర ఇన్‌చార్జి కొండా వెంకటేష్‌తో కలిసి ఇంటింటికీ తిరుగుతూ బీజేపీకి ఓటెయ్యాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సత్రం రమేష్, ఈర్ల సదానందం, మిట్టపల్లి మొగిలి, కుర్ర చక్రి, కారెంగుల శ్రీను, బద్రి శ్రీకాంత్, అంబాల సాగర్, సిరికొండ రాజు, రాగిడి రవి, కొంత మహేందర్ పాల్గొన్నారు.

'బీజేపీ గెలుపుతో గ్రామాల్లో అభివృద్ధి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గిరిజన గ్రామాల్లో గురువారం బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గఢ్‌పూర్, ర్యాలీ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్తూ బీజేపీ అందించనున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, బీజేపీ గెలిస్తే గ్రామాలు సస్యశ్యామలం చేస్తామని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెరబెల్లి రఘునాథ్ ప్రచారం చేశారు. ప్రచారంలో బీజేపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, నాయకులు తిరుపతి, వెంకటరమణారావు, గడ్డం స్వామిరెడ్డి, శ్రీనివాస్, సుదర్శన్, మధూకర్, రాజ్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన

చెన్నూర్: నివాస ప్రాంతాలలో నీరు నిలువ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీహెచ్‌వో రామూర్తి అన్నారు. స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం దోమల నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. దోమకాటుతో డెంగీ, చికెన్ గున్యా, మలేరియా, ఫైలేరియా, మెదడు వాపు లాంటి వ్యాధులు వస్తాయన్నారు. దోమల బారిన పడకుండా దోమ తెరలను వినియోగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, హెచ్ఈవో జగదీశ్, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బీఎల్‌పీ అభ్యర్థికి ఎంసీపీఐ మద్దతు లేదు'



మాట్లాడుతున్న కృష్ణ

బెల్లంపల్లి: బెల్లంపల్లి బీఎల్‌పీ అభ్యర్థితో తమపార్టీకి ఎలాంటి సంబంధం లేదని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి సబ్బని కృష్ణ స్పష్టం చేశారు. జిల్లా కమిటీ అత్యవసర సమావేశాన్ని గురువారం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌పీకి ఎంసీపీఐ మద్దతు అని వచ్చిన వార్తలో వాస్తవం లేదన్నారు. తప్పుడు వార్తను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. తమపార్టీ ఎవరికి మద్దతు ఇవ్వాలో ఇంకా ఖరారు చేయలేదని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేష్, రాజేంద్రప్రసాద్, రమేష్, రాజన్న పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధులకు నివాళి



నివాళులర్పిస్తున్న విప్ సుమన్, ఎంపీ వెంకటేశ్‌నేత

జైపూర్: స్వాతంత్య్ర సమరయోధులు, బీఆర్‌ఎస్ పార్టీ జైపూర్ మండల అధ్యక్షుడు బల్మూరి అరవీందర్‌రావు తండ్రి బల్మూరి తిరుమంగళరావు(95) అనారోగ్యంతో బుధవారం రాత్రి ఇంట్లో మరణించారు. ఈ సందర్భంగా గురువారం ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు బోర్లకుంట వెంకటేశ్‌నేతతో కలిసి నివాళులర్పించారు. బల్మూరి అరవీందర్‌రావు కుటుంబాన్ని ఓదార్చి వారికి అండగా నిలిచారు.

'స్టేట్ అచీవ్‌మెంట్ సర్వే'పై అవగాహన



దండేపల్లి: మాట్లాడుతున్న ఎంఈవో రవీందర్

కోటపల్లి: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు మండలంలో ఎంపికైన ప్రధానోపాధ్యాయులకు ముందస్తుగా సమావేశం ఏర్పాటు చేసి పరీక్ష నిర్వహించే విధానంపై అవగాహన కల్పించారు. సర్వేలో చేపట్టాల్సిన అంశాలను ఎంఈవో తిరుపతిరెడ్డి వివరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి మొగిలి, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, హెచ్ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

దండేపల్లి: విద్యార్థుల కనీస అభ్యసన సామర్థ్యాలను అంచనా వేసేందుకు 3, 6, 9 తరగతుల విద్యార్థులకు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఎస్ఈఏఎస్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో రవీందర్ సూచించారు. పరీక్ష నిర్వహణపై స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పరీక్ష విధి విధానాలపై వివరించారు. అనంతరం ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. పరీక్షల నిర్వహణ మండల నోడల్ అధికారి మల్లారి శ్రీనివాస్, కాంప్లెక్స్ హెచ్ఎంలు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీ హామీలపై ప్రచారం



వేంపల్లిలో ప్రచారం చేస్తున్న సురేఖ

మంచిర్యాలటౌన్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనే గెలిపించాలని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని 22వ వార్డు పద్మశాలి కాలనీలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంచిర్యాల కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వేంపల్లి, హాజీపూర్, గుడిపేట, నంనూర్ గ్రామాల్లో గడపగడపకూ వెళ్తూ ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసే ఆరు గ్యారంటీ హామీలను ఇంటింటికీ వివరిస్తూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావును గెలిపించాలని కోరారు. ప్రచారంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు తోట రవి, ఎంపీటీసీ డేగ బాపు, నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, గోనె సంజయ్‌రావు, నాయికిని సురేందర్, జూపాక ధర్మయ్య, గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సమాధుల పండుగ



రామకృష్ణాపూర్‌లో...



ప్రార్థన చేస్తున్న పాస్టర్, క్రిస్టియన్లు

రామకృష్ణాపూర్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని సమాధుల వద్ద క్రైస్తవులు ప్రతీ ఏటా జరుపుకునే సమాధుల పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మందమర్రిరూరల్: సమాధుల పండుగను గురువారం మందమర్రిలోని క్రైస్తవ శ్మశానవాటికలో నిర్వహించారు. సమాధులను పూలతో అలంకరించి, కొవ్వత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఫాదర్ జీజో, కిరణ్, పద్మారావు, రాజరత్నం, కిషోర్, రవి పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై పోలీసుల అవగాహన



కౌన్సిలింగ్ చేస్తున్న సీఐ రాజ్‌కుమార్ గౌడ్



పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ



మాట్లాడుతున్న సీఐ సంజీవ్

మందమర్రిరూరల్/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/తాండూర్/బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని బెల్లంపల్లిరూరల్ సర్కిల్ కార్యాలయంలో గురువారం బెల్లంపల్లి టూటౌన్, తాళ్లగురిజాల, నెన్నెల పోలీసుస్టేషన్‌ల పరిధిలోని రౌడీ షీటర్లతో సీఐ రాజ్‌కుమార్‌గౌడ్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... ఎన్నికల్లో రౌడీ షీటర్లు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడొద్దన్నారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని పేర్కొన్నారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు రాసబత్తుల గణేష్, ఉండ్రాళ్ల రవి, బర్ల స్రవంతిలకు ఎస్‌హెచ్‌ఓ బన్సీలాల్ కౌన్సిలింగ్ నిర్వహించి సత్ప్రవర్తనతో మెలగాలని ఆదేశించారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడొద్దని హెచ్చరించారు. అనంతరం రౌడీ షీటర్లను ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఎస్సైలు పాల్గొన్నారు. తాండూర్ పోలీసుసర్కిల్‌లోని తాండూర్, మాదారం, భీమిని, కన్నెపల్లి పోలీసుస్టేషన్‌ల పరిధిలోని రౌడీ షీటర్లకు తాండూర్ పోలీసు సర్కిల్ కార్యాలయంలో సీఐ శ్రీనివాసరావు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం వారిని తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాపల్లి గ్రామంలో గురువారం స్థానికులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ తోట సంజీవ్ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ప్రతి ఒక్కరూ ఎలాంటి వాదనలు, గొడవలు లేకుండా పరిస్థితులు చక్కగా ఉండేలా చూడాలన్నారు. ఎస్సై నరేశ్‌కుమార్, పోలీస్ సిబ్బంది, రాపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు. మందమర్రి సర్కిల్ ఆఫీస్‌లో ఎస్సైలు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి సూచించారు. రామగుండం సీపీ రెమారాజేశ్వరి ఆదేశాల మేరకు పోటీ చేసే అభ్యర్థులకు, ప్రజాప్రతినిధులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో సర్కిల్ పసరిధిలోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఐలాండ్‌ను ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



గాయాలైన యువకుడు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని లక్ష్మి థియేటర్ చౌరస్తాలో నిర్మిస్తున్న ఐలాండ్‌ను ద్విచక్ర వాహనంతో ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. కాంగ్రెస్ నాయకులు సంఘటన స్థలంలో ధర్నాకు దిగారు. గతంలోనూ ఓ యువకుడు ఐలాండ్‌ను బైక్‌తో ఢీకొట్టి మృతిచెందిన సంఘటన చోటు చేసుకుందని, ప్రమాదాల నివారణపై పాలకులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. గాయపడిన యువకుడు ఎవరనేది సీఐ రాజు, ఎస్సైలు రాజేందర్, జగదీశ్ వివరాలు సేకరిస్తున్నారు. ఆందోళనకారులతో మాట్లాడి విరమింపజేశారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పండి

- మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్



బీజేపీలోకి ఆహ్వానిస్తున్న రాథోడ్ రమేశ్

జన్నారం: ప్రజా వ్యతిరేక బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఎన్నికల్లో చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలని మాజీ ఎంపీ, ఖానాపూర్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేశ్ కోరారు. మండలంలోని మురిమడుగులో గురువారం సీనియర్ బీజేపీ నాయకుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, భర్త రాజలింగు 200మంది యువకులతో బీజేపీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోలి చందు, బీజేపీ నాయకులు దండం అశోక్, అమరకొండ భీమేశ్, రాజెందర్, రంజిత్ పాల్గొన్నారు.

ఇంటింటికీ బీఆర్‌ఎస్ ప్రచారం



నాగంపేటలో ప్రచారం చేస్తున్న నాయకులు

కోటపల్లి/చెన్నూర్‌రూరల్/చెన్నూర్: బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్‌కు ఓటు వేసి గెలిపించాలని గురువారం చెన్నూర్ పట్టణంలో, చెన్నూర్‌రూరల్, కోటపల్లి మండలాల్లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో చెన్నూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు రాంలాల్‌గిల్డా, మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, మాజీ సర్పంచ్ కృష్ణ, చెన్నూర్‌రూరల్ మండలంలో మంజుల, తిరుపతి, సమ్మిరెడ్డి, స్వప్న, రమేష్, కోటపల్లి మండలంలో ఎంపీపీ సురేఖా, నాగంపేటలో సింగిల్ విండో చైర్మన్ సాంబగౌడ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నియామకం

మంచిర్యాలటౌన్: యూత్ కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధిగా మంచిర్యాలకు చెందిన యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవునూరి రాజ్‌కుమార్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ గురువారం నియామక ఉత్తర్వులను జారీ చేశారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

భీమారం: మండలంలోని మద్దికల్ గ్రామ బీఆర్‌ఎస్ కమిటీ అధ్యక్షుడు కనకయ్యతో పాటు పలువురు యువకులు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. గ్రామ అధ్యక్షుడు కనకయ్య మాట్లాడుతూ.. పార్టీకి తాము ఎంతో కష్టపడుతున్నా అధిష్టానం పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 200మంది యువతతో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

బీఎస్పీ మండలాధ్యక్షుడిగా సంతోష్

శ్రీరాంపూర్: నస్పూర్ మండల అధ్యక్షుడిగా దర్శనాల సంతోష్‌ను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ గుణ, జిల్లా ఇన్‌చార్జి రాజేష్ గురువారం తెలిపారు.